# మన(సు)లో మాట

సంఘమిత్ర పాఠకులకు, వారి విలువైన సలహాలకు మా ధన్యవాదములు. గత సంచిక రంగులతో ముస్తాబై పలువురిని అలరించినందులకు మాకు చాలా సంతోషము. ఉగాది సంచికకు, 400 శాతము పెరిగిన పాఠకుల సంఖ్యే వారి అభిమానానికి తార్కాణము. ఈ సారి ప్రతి అంశానికి తగువిధముగా చిత్రాలను తెచ్చే ప్రయత్నము చేసాము. ధన సహాయము చెయ్యడానికి ముందుకు వచ్చిన మిత్రులకు కృతజ్ఞతలు. రానున్న సంచికలలో ప్రచురించడానికి మీ వంతుగా ఏవైనా కథలు, కవితలు, వ్యాసాలూ, మీకు నచ్చిన ఏవైనా అంశాలు వ్రాసి పంపిస్తే, దానిని సంఘమిత్ర పాఠకులకు అందించే ప్రయత్నము చేస్తాము.

సంఘమిత్రలో ప్రచురణ కోసము కథలు, కవితలు, నాటి సామెత - నేటి సామెత, భక్తి-ముక్తి అనే అంశాలు పంపిన మిత్రులకు, మాచిరాజు లక్ష్మీ గంగా భవాని గారికి, విలువైన సలహాలను అందించి, అప్పటికప్పుడు తనకు గుర్తున్న శతక పద్యాలను, భక్తి గీతాలను వ్రాసి ఇచ్చి తన అభిమానాన్ని తెలియజేసిన కరణం ఉమాదేవిగారికి, మాఘపు వాసంతి గారికి, మరియు ప్రత్యక్షముగా, పరోక్షముగా సంఘమిత్ర ప్రగతికి దోహదం చేస్తున్న అందరికీ మా హృదయ పూర్వక ధన్యవాదములు. ఈ సారి కోరమాండల్ ఫెర్టిలైజర్ సంస్థలో ఉద్యోగి అయినాపురపు రఘు పంపిన కవిత ప్రచురిస్తున్నాము. అవకాశమును బట్టి మిగిలిన రచనలు కూడా ప్రచురిస్తాము. మీరు పంపిన రచనలు యథాతథముగా ముద్రించే ప్రయత్నము చేస్తాము. ఒకవేళ ఏమైనా మార్పులు చెయ్యవలసి వస్తే, ముందుగా మీ అనుమతి తీసుకుని అవసరమైన మార్పులు చేస్తాము. ప్రచురించబడిన అంశాలమీద మీ అభిప్రాయములు పంపితే, ఉత్తమమైన విమర్శను సంఘమిత్రలో ప్రచురిస్తాము.

సంఘమిత్ర, పిల్లల వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకుని, జూన్ 4 నుండి జులై 30 వరకు (9 శనివారములు) శ్రీనివాస రామానుజన్ గణిత చర్చాసంఘము (Srinivasa Ramanujan Mathmatics Club) ను నిర్వహిస్తోంది. ఊహించిన దానికన్నా ఎక్కువ సంఖ్యలో పిల్లలు దీనికి హ-జరు కావడము హర్షించదగ్గ విషయము. ఈ కార్యక్రమము పిల్లలలో ఉత్సాహాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంచిందని చెప్పడము మా ఉత్సాహానికి ఊపిరి పోసినట్లైనది. ముందు ముందు పిల్లలకు ఉపయోగపడే విధముగా ప్రముఖుల ఉపన్యాసములు ఏర్పాటు చేయాలనే మా సంకల్పానికి పెక్కుమంది అండగా నిలవడము మమ్ము ఆనంద పరవశులను జేసింది.

ఈ సంచికలో పిల్లల ఆలోచనలు, వారికిష్టమైన విషయాలు, కష్టమైన విషయాలు వారి మాటల్లో తెలియజేస్తూ ఓ శీర్షికని వచ్చే సంచిక నుండి ప్రవేశపెడుతున్నాము. సంఘమిత్ర క్రొంగొత్త శీర్షికలతో, రంగులతో - కనులకు పసందుగా, మనోల్లాసాన్ని అందించుతూ, మీ మన్ననలతో దినదిన ప్రవర్ధమానమవుతుందని మా విశ్వాసము. ధన్యవాదములతో

సంపాదక బృందము.